

సాక్షి
వికారాబాద్
సోమవారం । 9 । జనవరి । 2023



పర్యావరణంపై గొడ్డలి వేటు
పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు. పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. 8లో▸



బోనమెత్తిన పల్లెలు
మండలంలో గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం అంతారంలో ఊర డమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. 8లో▸



'శివసాగర్'కు మోక్షం!
విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై నిర్మిస్తున్న శివసాగర్ ప్రాజెక్టు కాల్వల పనులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. 9లో▸

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తాం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా తమ సంఘం పని చేస్తుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానయ్య పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి పాఠశాలలో సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మారెంపల్లి లక్ష్మినారాయణ తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘం బహుజన సంఘమని, బహుజన బిడ్డల కోసం పోరాటం చేస్తుందన్నారు. లక్ష్మినారాయణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల రక్షణ కోసం తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెంట అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు నరేందర్, విష్ణు, అశోక్, భగవాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కాంస్య పతకం



మహేందర్‌ను అభినందిస్తున్న నాయకులు

పరిగి: మండలంలోని రూప్‌ఖాన్‌పేట్‌కు చెందిన ఉప్పరి మహేందర్ సౌత్‌ఇండియా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించారు. ఈ నెల 6నుంచి 8వ తేదీ వరకు నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన సౌత్ ఇండియా తైక్వాండో 72 కేజీల విభాగంలో పాల్గొన్నారు. మహేందర్‌ను తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ట్రెజరర్ మహేశ్వర్, తైక్వాండో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహేద్ ఆలీఖాన్, కోచ్ శ్రీనివాస్‌లు తదితరులు అభినందించారు.

ఒకదానికొకటి.. ఐదు కార్లు ఢీకొట్టి..



తుర్కయంజాల్: ఒకదానికొకటి ఐదు కార్లు ఢీకొట్టిన సంఘటన సాగర్ రహదారిపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాగన్నగూడలో చోటు చేసుకుంది. వివరాలివీ.. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో సబ్‌స్టేషన్ ఎదురుగా ఎగ్జిట్ టువెల్ హోటల్ వద్ద వ్యాగన్ ఆర్ కారు (టీఎస్07హెచ్ఎక్స్1578) డ్రైవర్ సిగ్నల్ వేయకుండా యూటర్న్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న మారుతి ఎర్టిగా కారు (ఏపీ23ఏఎల్ 6607) డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశారు. దీంతో ఆ వెనుకే వస్తున్న టయోటా ఇటియోస్ (టీఎస్08 యూబీ8546), ఇన్నోవా క్రిస్టా (టీఎస్08హెచ్ జే6699), ఫోర్డ్ కారు (టీఎస్07 ఈజీ 2727) కార్లు ఒకదానికొకటి వెనుక నుంచి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవా, ఫోర్డ్ కార్లు ఎక్కువగా ధ్వంసం అయ్యాయి. మిగతా కార్లు స్వలంగా డ్యామేజ్ కాగా ప్రమాదానికి కారణమైన వ్యాగన్ ఆర్ కారుకు ఏమీ కాలేదు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఒకేసారి ఐదు కార్లు ఢీ కొనడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.



కంటి వెలుగు సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కేసీఆర్ ముందుచూపే.. 'కంటి వెలుగు'

18నుంచి ప్రారంభం

- వంద రోజుల పాటు కార్యక్రమం
- సమన్వయంతో పనిచేసి సక్సెస్ చేయాలి
- సమీక్షలో మంత్రి సబితారెడ్డి
- చర్చనీయాంశమైన కలెక్టర్ గైర్హాజరు

వికారాబాద్: ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం తీసుకొచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని మానవతా దృక్పథంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. 2018లో మొదటి విడత నిర్వహించి విజయవంతం చేశామన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రెండో విడతనూ విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు తెలిసేలా విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి రేషన్ దుకాణం, ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ స్థలాల్లో ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు అతికించాలన్నారు. మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమై వంద రోజులు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కంటి వెలుగు కార్యక్రమం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ నెల 12వ తేదీలోపు గ్రామ, మండల, మున్సిపల్ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో రోజుకు 400, గ్రామ పంచాయతీల్లో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 42 వైద్య బృందాలను అందుబాటులో ఉంచి 566 గ్రామ పంచాయతీలు, 97 మున్సిపల్ వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తామని మంత్రి సబితారెడ్డి తెలిపారు. ఇప్పటికే 40 వేల కళ్లద్దాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదయ్య, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కోటిరెడ్డి, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ కృష్ణన్, జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్, డీఈవో రేణుకాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్ గైర్హాజరుపై దుమారం

కంటి వెలుగు సమీక్షకు కలెక్టర్ నిఖిల గైర్హాజరుపై తీవ్ర దుమారం రేగింది. సమావేశానికి మీడియాను అనుమతిస్తామని ముందుగా చెప్పిన అధికారులు తరువాత లోపల వాతావరణం వేడెక్కడంతో నిరాకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కలెక్టర్ సమావేశానికి గైర్హాజరు కావడంతో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి నిలదీశారు. మంత్రి హాజరైన కీలక సమావేశానికి కలెక్టర్ రాకుంటే ఎలా అని ప్రశ్నించారు. గత జిల్లా పరిషత్ సమావేశానికి కూడా ఆమె దుమ్మా కొట్టారు.. ఇలా ప్రతి సమావేశానికి కలెక్టర్ కావాలనే హాజరు కావడంలేదని మంత్రి సమక్షంలో ఆయన నిలదీశారు. యాలాల్‌లో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు.. ఫిర్యాదు చేసినా కలెక్టర్ స్పందించరా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలోనే మంత్రి సబితారెడ్డి కల్పించుకుని కలెక్టర్‌కు జ్వరం వచ్చింది.. తనకు సమాచారం ఇచ్చే వెళ్లిందని పేర్కొన్నారు. దీంతో శాంతించని ఎమ్మెల్సీ ఇప్పుడు నువ్వు పిలువు అంటూ ఏకవాక్య సంబోధన చేయడంతో ఒకింత నొచ్చుకున్న మంత్రి నువ్వు అని అలా మాట్లాడకని ఎమ్మెల్సీకి సూచించారు. వెంటనే మహేందర్‌రెడ్డి గౌరవ మంత్రిగారు.. మీరు కలెక్టర్‌ను పిలవండి అన్నారు. ఆమె సర్ది చెప్పే ప్రయత్నం చేసింది. ఆ వెంటనే కొద్ది సేపటికి మహేందర్‌రెడ్డి సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా: సునీతారెడ్డి



కలెక్టర్ నిఖిల తీరును సీఎం కేసీఆర్, సీఎస్ సోమేష్‌కుమార్ దృష్టికి తీసుకెళుతామని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ వైఖరితో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని పేర్కొన్నారు. ఆమె సమావేశాలకు గైర్హాజరు కావడాన్ని ప్రశ్నించిన జెడ్పీటీసీల విషయంలో కలెక్టర్ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వాస్తవ పరిస్థితులను కలెక్టర్‌కు వివరిస్తే ఆమె స్పందించడం లేదన్నారు. జిల్లా ప్రజలు, పేదలు, రైతులకు రాత్రి, పగలు అండగా ఉండాల్సిన కలెక్టర్ వారిని పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. కలెక్టర్‌పై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఆమె కావాలనే సమావేశాలకు రాకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు. కలెక్టర్ అంటే జిల్లా ప్రజలకు దేవతలా కనిపించాలని, ఎక్కడా ఆ తరహాలో ఆమె ప్రవర్తించడం లేదని సునీతారెడ్డి పేర్కొన్నారు.

ఫీ'జులుం'

- గాడితప్పిన విద్యావ్యవస్థ
- ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో ఇష్టారాజ్యంగా వసూళ్లు
- పరీక్షల పేరుతో వేధిస్తున్న యాజమాన్యాలు
- డబ్బులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామంటూ బ్లాక్ మెయిల్
- పట్టించుకోని అధికారులు

వికారాబాద్: ప్రైవేటు పాఠశాలల దోపిడీని నియంత్రించడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమవుతోంది. ప్రభుత్వ చార్టును పక్కన పెట్టి.. ఎవరికి తోచిన విధంగా వారు ఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో స్లిప్ టెస్టులు మొదలుకుని సమ్మెటీవ్, ఫార్మెటీవ్ వరకు ఏ పరీక్షలు నిర్వహించినా స్పెషల్ ఫీజులంటూ వేధిస్తున్నాయి. అడిగినంత చెల్లిస్తేనే ఎగ్జామ్ రాయనిస్తామని కండీషన్ పెడుతున్నాయి. ఫీజు చెల్లించని విద్యార్థులను స్కూల్ యాజమాన్యాలు గంటల తరబడి నిలబెడుతున్నాయి. ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లమని చెబుతున్న సిబ్బంది.. ఆఫీస్ రూమ్‌కి పంపించి చీవాట్లు పెడుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని అదుపు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. డీఈఓ కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బందితో ప్రైవేటు స్కూళ్ల నుంచి డబ్బులు వసూలు చేయిస్తున్నారని తెలుస్తోంది. జిల్లాలో అధికారికంగా 185 ప్రైవేటు పాఠశాలలు ఉండగా.. వీటిలో 45,000 మంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యాశాఖ విఫలం..

ఫీజుల మోత మోగించడంలో పోటీ పడుతున్న ప్రైవేటు యాజమాన్యాలు పాఠశాలల్లో వసతుల కల్పనపై దృష్టి సారించడం లేదు. ఇంటర్, డిగ్రీలో వివిధ గ్రూపులకు సంబంధించి రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు వసూలు చేస్తుండగా.. పాఠశాల విద్యలో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సంవత్సరానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని స్కూళ్లలో ఎల్‌కేజీ పిల్లలకే ఏకంగా ఏడాది రూ.30 వేల వరకు తీసుకుంటున్నారు. ఎస్–1 వన్, ఎస్– 2 , ఎఫ్–1 , ఎఫ్– 2, ఎఫ్– 3, ఎఫ్– 4 పేర్లతో ఎగ్జామ్స్ నిర్వహిస్తూ ప్రతీసారి ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు మించి నాలుగు రెట్లు అధికంగా తీసుకుంటున్నారు.

నిబంధనలకు నీళ్లు

మెజార్టీ ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదు. స్కూళ్లలోనే పాఠ్యపుస్తకాలు, టై, బెల్టులు, యూనిఫారాలు విక్రయిస్తూ దండుకుంటున్నారు. జిల్లాలోని 185 ప్రైవేటు పాఠశాలల్లో పది స్కూళ్లకు మాత్రమే ఆట స్థలాలు ఉన్నాయి. పట్టణాల్లో చాలా వరకు రహదారుల పక్కనే కొనసాగుతున్నాయి. కనీస విచారణ కూడా చేపట్టకుండా వీరికి ట్రాఫిక్ నో అబ్జెక్షన్ జారీ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులను చూపించి. ఇంటర్ చదివిన వారితో టీచింగ్ చేయిస్తున్నారు.

ఫీజు చార్టు ఇలా..

చివరగా 2018– 19 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఫీజుల చార్టు విడుదల చేసింది. దీనిప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ.650, సంవత్సరానికి 7,800 వసూలు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.750, ఏడాదికి రూ.9,000 తీసుకోవాలి. ఉన్నత పాఠశాల స్థాయిలో రూరల్ ఏరియాల్లో ప్రతినెలా రూ.900, ఏడాదికి రూ.10,800, అర్బన్ ప్రాంతాల్లో నెలకు రూ.1,000, ఏడాదికి రూ. 12,000 తీసుకోవాలనే నిబంధనలున్నాయి. ఆయా స్కూళ్లలో కల్పించే సౌకర్యాల ఆధారంగా పదిశాతం అదనంగా వసూలు చేసే అవకాశం ఇచ్చారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలి. స్కూళ్లలో పుస్తకాలు ఇతర వస్తువులు, దుస్తులు విక్రయించకూడదు. పర్మిషన్ లేని స్కూళ్లకు నోటీసులు జారీ చేస్తాం. అధిక ఫీజులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– రేణుకాదేవి, డీఈఓ

ఓయమ్మో.. ప్రాణం పాయే..



మహిళ మృతదేహం

- నన్ను సంపుతుండు అని కూతురుకు ఫోన్ చేసిన మహిళ
- చీర కొంగుతో గొంతు నులిమి హత్య
- వివాహేతర సంబంధమే కారణం

మొయినాబాద్: కీడును శంకించిన ఓ మహిళ తన హత్యకు ముందు కూతురుకు ఫోన్ చేసింది. ఓయమ్మో.. నా మానం పాయే.. ప్రాణం పాయే.. నన్ను సంపుతుండే అంటూ భయాందోళనతో చెప్పిన మాటలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మేస్త్రీ.. ఒంటరిగా ఉన్న సదరు మహిళను గొంతు నులిమి చంపాడు. ఈ సంఘటన మొయినాబాద్‌లో ఆదివారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మిరెడ్డి కథనం ప్రకారం .. వికారాబాద్ జిల్లా దోమ మండలం మల్లేపల్లికి చెందిన పులుకుంట లక్ష్మి (50), రాములు దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వచ్చారు. అద్దె గదిలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మొగలమడక గ్రామానికి చెందిన హన్మంతు కొన్నేళ్లుగా మొయినాబాద్‌లో ఉంటూ మేస్త్రీ పని చేసేవాడు. మేస్త్రీ చేతి కింద పనికి వెళ్లిన లక్ష్మికి అతనితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఎనిమిది నెలల క్రితం లక్ష్మి భర్త రాములు మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె తన కొడుకుతో కలిసి సొంతూరు మల్లేపల్లికి వెళ్లి అక్కడే వ్యవసాయం చేసుకూంటూ జీవనం సాగిస్తోంది. పదిహేను రోజుల క్రితం కూలి పని కోసం మళ్లీ మొయినాబాద్‌కు వచ్చింది. అద్దె గదిలో ఉంటూ కూలి పని చేస్తోంది. విషయం తెలుసుకున్న హన్మంతు శనివారం రాత్రి ఆమె గదికి వచ్చాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న అతడు తనను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆమెతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన హన్మంతు.. చీర కొంగుతో లక్ష్మి మెడకు చుట్టి గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, నిందితుడు హన్మంతును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దళారులొస్తున్నారు జాగ్రత్త..!

- పత్తి తూకంలో మోసం.. ధరల్లో వ్యత్యాసం
- తేమ పేరుతో నిలువు దోపిడీ
- కానరాని ఎలక్ట్రానిక్ కాంటాలు, రాళ్ల తూకాలే దిక్కు
- నష్టపోతున్న రైతులు



రైతుల వద్ద ఖరీదు చేసి తరలిస్తున్న పత్తి (ఫైల్)

పెద్దేముల్: పత్తి ధర పెరగడంతో మళ్లీ దళారులు వాలిపోతున్నారు. పంట చేతికి రాకముందే రైతన్నలను గాళం వేస్తున్నారు.. ఎలక్ట్రానిక్ కాంటాలు కాకుండా రాళ్లతో తూకం వేస్తున్నారు. తేమ పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈ విషయంపై ఏటా తునికల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది పత్తి రైతులకు లాభాలు రావడంతో ఈ ఏడాది మండలంలో అధిక విస్తీర్ణంలో పత్తి పంటను సాగుచేశారు. అయితే దిగుబడి మాత్రం బాగా తగ్గింది. సాధారణంగా ఎకరాకు 10నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ ఈ ఏడు 5నుంచి 6 క్వింటాళ్లకు మించలేదు. ఎకరా పత్తి సాగుకు రైతులు సుమారు రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు ఖర్చు చేశారు. అయితే ఎన్నో ఆశలతో పంట సాగు చేసిన రైతులకు లాభాలు వచ్చేలా కనిపించడం లేదు. పంట ప్రారంభ సమయంలో అధిక వర్షాల కారణంగా మొక్కలు ఎదగలేదు. చీడపీడలు ఆశించాయి. దీంతో దిగుబడి భారీగా తగ్గింది. దీనికి తోడు మద్దతు ధర కూడా అనుకున్న మేర దక్కేలా లేదు. దళారుల బెడద కూడా ఎక్కువైంది. పంట చేతికి రాకముందే రైతులను గాళం వేస్తున్నారు. ధర ఎక్కువ ఇస్తామంటూ తూకంలో మోసం చేస్తున్నారు. ప్రతి ఏటా తూకాల్లో మోసాలను రైతన్నలు పట్టుకున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మూడేళ్ల నుంచి పెద్దేముల్ మండలం మంబాపూర్, రుక్మాపూర్, నాగులపల్లి, రుద్రారం, జనగాం, మారేపల్లి రైతులు తూకాల్లో మోసాలను అడ్డుకున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు. తూకానికి రాళ్లు వాడడం వల్ల క్వింటాలుకు సుమారు 8నుంచి 10 కేజీల వరకు దోచుకుంటున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే దౌర్జన్యాలు చేస్తున్నారు. గత ఏడాది క్వింటాలు పత్తి ధర రూ. 10వేలకు పైగా పలికింది. ఈ ఏడాది దళారులు మాత్రం రూ. 7200నుంచి రూ. 7500లకు మించి చెల్లించడం లేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు పత్తి రూ. 8250 నుంచి రూ. 8300 పలుకుతోంది. ఏటా మండలంలో రోజుకు సుమారు 8నుంచి 10 డీసీఎంల పత్తి ఖరీదవుతుంది. పత్తి తూకం చేసే వ్యక్తికి దళారులు రోజుకు రూ. 1500నుంచి రూ. 2000 కూలి చెల్లిస్తారు. ఉదయం, సాయంత్రం వారికి సకల మర్యాదలు చేస్తారు. అవసరం ఉంటే అడ్వాన్స్ కూడా ఇస్తారు. నీ పైనే మా వ్యాపారం ఉందని.. నీవే మాకు దిక్కు అంటూ మాయమాటలు చెప్పి వారిని మోసాలు చేయించి రైతులను నట్టేట ముంచుతున్నారు. తెలిసిన రైతులు ఉంటే మాత్రం మీ ఇంట్లో కాంటాలు ఉంటే దానితో తూకం వేసుకోవాలని చెబుతున్నారు.

మోసాలు అరికట్టాలి



ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి రైతులను మోసం చేసే ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. తూకాల్లో మోసం చేసే దళారీతో పాటు తూకం వేసే వ్యక్తిపై పోలీస్ కేసులు పెట్టాలి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వచ్చేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

– లాలప్ప, రైతు, ఇందూరు

పెట్టుబడీ కష్టమే



పత్తి పంట సాగుకు లక్షలు వెచ్చించాం. కానీ దిగుబడి రాలేదు. ఏటా వర్షాలు నట్టేట ముంచుతున్నాయి. భారీ వర్షాలకు 30శాతం పంటలు పాడయ్యాయి. ప్రభుత్వం దెబ్బతిన్న ప్రతి ఎకరా పత్తి పంటకు రూ. 25వేలు చెల్లించాలి. లేకుంటే అప్పులపాలు కావడం ఖాయం. మా గోడు ఎవరికీ పట్టడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– వెంకటరెడ్డి, రైతు, పెద్దేముల్

కేసులు నమోదు చేస్తాం



పత్తి తూకాల్లో మోసం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ప్రభుత్వం నిర్ణయించిన కాంటాల్లోనే తూకం వేయాలి. రైతులను మోసం చేసే వారిపై కేసులు నమోదు చేస్తాం. అవసరమయితే వాహనాన్ని సీజ్ చేస్తాం.

– అబ్దుల్‌రవూఫ్, ఎస్‌ఐ, పెద్దేముల్

జిల్లాకు కేసీఆర్ చేసిందేమీ లేదు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాకు చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వికారాబాద్‌లోని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ నివాసంలో జిల్లాలోని ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులతో సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న హాత్ సే హాత్ జోడో కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తన స్వార్థ ప్రయోజనాల కోసం జిల్లాకు వచ్చి.. చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టును రీ డిజైన్ చేసి నీళ్లను వారి జిల్లాలకు మళ్లించుకెళ్లారని ఆరోపించారు. జిల్లాకు ఇప్పటివరకు ఒక్క సాగునీరు ప్రాజెక్టు కూడా తీసుకురాలేదన్నారు. రెండేళ్లలో సాగునీరు ఇస్తానన్న సీఎం ఎనిమిదేళ్లు అవుతున్న ఏమి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిల్లులు రాక సర్పంచులు అప్పుల పాలయ్యారన్నారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంతో ప్రతి ఇంటికీ వెళ్తామన్నారు. గతంలో తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల కాలంలో జిల్లాకు ఒక్క ప్రాజెక్టు, ఒక్క కంపెనీ కూడా తేలేదని ఆరోపించారు. ఉద్యోగావకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు భూములిస్తే వాటిని టీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. జిల్లాలో కాంగ్రెస్ పటిష్టంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలతో మమేకమై అధికారం చేపట్టే దిశగా ముందుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ తాండూర్ ఇన్‌చార్జ్ రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ధారాసింగ్, రఘువీరారెడ్డి, జెడ్పీటీసీ సంతోష,, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు శోభారాణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, నాయకులు సతీష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పర్యటన రేపు

మోమిన్‌పేట: మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో నిర్మించిన కేజీబీవీ ఇంటర్మీడియట్ కళశాల భవనాన్ని ఈ నెల 10న మంత్రి సబితా రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ ప్రారంభించనున్నట్లు సర్పంచ్ అంజయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం బీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు.

కార్మికులకు న్యాయం చేసేవరకు పోరాటం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ



సదస్సుకు వెళ్లే వాహనానికి జెండా ఊపుతున్న సీఐటీయూ నాయకులు

పరిగి: కార్మికులకు కనీస వేతనాలను చెల్లించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో ఇందిరా పార్క్ రాష్ట్ర సదస్సుకు పరిగి మండల కేంద్రం నుంచి కార్మికులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి వీడాలన్నారు. సమస్యల పరిష్కరించేంత వరకు సీఐటీయూ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, నరసమ్మ, మంగమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' షెడ్యూల్ విడుదల

పూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమాదేవి సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం షెడ్యూల్ విడుదల చేశారు.

తేది	గ్రామం
జనవరి 18, 19న	దేవనోనిగూడ
జనవరి 20న	సిరిగాయపల్లి
జనవరి 25న	గట్టుపల్లి
జనవరి 31న	కొత్తపల్లి
ఫిబ్రవరి 3న	కెరవెళ్లి
ఫిబ్రవరి 9న	చింతలపల్లి
ఫిబ్రవరి 15న	తుర్క ఎన్కేపల్లి
ఫిబ్రవరి 22న	గంగుపల్లి
మార్చి 1న	చీలాపూర్
మార్చి 9న	తిరుమలాపూర్
మార్చి 17న	నిజాంపేట్‌మేడిపల్లి
మార్చి 28న	సోమన్‌గుర్తి
ఏప్రిల్ 11న	మంచన్‌పల్లి
ఏప్రిల్ 26న	పూడూరు

ప్రజల సహకారంతోనే పరిశుభ్రత

మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

వికారాబాద్ అర్బన్: ప్రజా సహకారంతోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. ఆదివారం ఆయన మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు, 15వ వార్డు ఎల్లమ్మ తోట, కలెక్టర్ కార్యాలయం ఎదుట కాలనీలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో మాట్లాడుతూ చెత్త ఆరు బయట వేయకూడదని సూచించారు. ఇంటి ఎదుటకు చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామానికి చెందిన బర్రు నాగరాజు(38) ప్రైవేట్ ఉద్యోగి. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం రాగన్నగూడ పాఠశాల నుంచి తన కూతురిని బైక్ మీద ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో మస్కటి వద్ద ఓ వ్యక్తి వేగంగా రోడ్డుదాటుతున్నాడు. అతన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి నాగరాజు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమవ్వడంతో బాధితుడిని నగరంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పర్యావరణంపై గొడ్డలి వేటు

నీరుగారుతున్న హరిత లక్ష్యం

- పగలు నరకడం.. రాత్రి తరలించడం
- చోద్యం చూస్తున్న అధికారులు



నాగులపల్లి అడవిలో కొట్టివేసిన కలప

పెద్దేముల్: పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు. పర్యావరణాన్ని కాపాడండి అంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. హరితహారం పేరిట మొక్కలు నాటుతూ.. వాటి పెంపకానికి ప్రభుత్వం ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ అటవీశాఖ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఒకవైపు నాటుతుండగా.. మరోవైపు మహా వృక్షాలను అక్రమార్కుల గొడ్డలి వేటుకు నేలకూలుతున్నాయి. పట్టపగలు నరుకుతూ.. చీకటిమాటున పరిశ్రమలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలో సుద్ద పరిశ్రమలు, ఇటుక బట్టీలు అధికంగా ఉండడంతో కలపకు డిమాండ్ ఏర్పడింది. పంట పొలాల్లో రెవెన్యూ, అటవీ అధికారుల అనుమతులు లేకుండానే చెట్లను నరుకుతూ తాండూరు, వికారాబాద్, జహీరాబాద్ పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కనబడని మొక్కలు

అటవీ శాతాన్ని రెట్టింపు చేసే ఉద్దేశంతో ప్రభుత్వం నాటుతున్న మొక్కల్లో 50శాతం కూడా కనబడటం లేదని ప్రజలు వాపోతున్నారు. పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్, కందనెల్లి, తట్టెపల్లి, అడ్కిచెర్ల, నాగులపల్లి, పెద్దేముల్ మారేపల్లి ప్రాంతాలల్లో అధికంగా చెట్లు నరుకుతూ.. మారేపల్లి, కోటపల్లి మండల ఓగ్లాపూర్ గ్రామ శివార్లలోని సుద్ద పరిశ్రమలకు కలప తరలిస్తున్నారు. అక్రమార్కులు రెచ్చిపోతున్నా.. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. అప్పుడప్పుడు కలప తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుంటూ జరిమానా వేసి వదిలేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

వాల్టా చట్టం ప్రకారం అక్రమంగా కలప, ఇసుక తరలిస్తే.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. కానీ మండల స్థాయిలో ఏ అధికారి పట్టించుకోవటం లేదు. చెట్ల నరికివేత, కలప తరలింపు నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. రైతులు పట్టా భూముల్లో చెట్లను నరికి వేయాలనుకుంటే వీఆర్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలి. ఆయన స్థలాన్ని పరిశీలించిన అనంతరం తహసీల్దార్ అనుమతి ఇస్తేనే రైతులు చెట్లను కొట్టవలసి ఉంటుంది. కానీ మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండానే చెట్లను నరికి అక్రమార్కులు, అధికారులు కుమ్మక్కై కలప వ్యాపారం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



కందనెల్లితండా ఇటుక బట్టీల వద్ద..

కేసులు నమోదు చేస్తాం



అనుమతులు లేకుండా వృక్షాలను నరికితే చట్టం ప్రకారంగా కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం. ప్రస్తుతం ఎవరికీ అనుమతులు ఇవ్వడం లేదు ఎవరైనా కొడుతున్నట్లు సమాచారం ఉంటే ఫిర్యాదు చేయండి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్, పెద్దేముల్

బోనమెత్తిన పల్లెలు

అంతారంలో ఊరడమ్మ జాతర

- చింతమణిపట్నం, కోటబాసుపల్లిలో మైసమ్మ తల్లికి మొక్కుల చెల్లింపు

తాండూరు రూరల్: మండల పరిధిలో గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అంతారం గ్రామంలో ఊరడమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ జీవరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు. మండల పరిధిలోని చింతమణిపట్నం గ్రామంలో రక్తమైసమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ విమల్మ, గ్రామస్తులు పాల్గొన్నారు. కోటబాసుపల్లిలో మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచ్ నాగార్జున,గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ఉత్సవాలు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు సుభాష్ నగర్‌లో నాలుగురోజులుగా కొనసాగుతున్న బుర్జు మైసమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల కాలనీ వాసులతో బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.



బోనంతో చైర్‌పర్సన్ మంజుల



చింతమణిపట్నంలో రక్తమైసమ్మ బోనాల ఊరేగింపు

పదోన్నతులు కల్పించాలి

అనంతగిరి: భాష పండితులకు పదోన్నతులు కల్పించాలని ఆర్‌యూపీపీ టీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యేలు యాదయ్య, నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజాజ్, కోశాధికారి మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు భీమయ్య, నాయకులు శ్రీనివాస్, నైమొద్దీన్, నవీన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

మంత్రికి 'నూతన' శుభాకాంక్షలు

వికారాబాద్ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం జ్ఞాపిక అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. – అనంతగిరి



సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. వారి గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, ఎమ్మెల్యే సోదరులు కొప్పుల అనిల్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, పాంబండ ఆలయ చైర్మన్ రాములు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, మండలకోఆప్షన్ సభ్యుడు జుబేర్, నాయకులు మొగులయ్య, వెంకట్, కొండయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, బిచ్చయ్య, గోపాల్, లక్ష్మయ్య, రఘు, తిరుపతి, తుల్జ్యా, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

పరిగి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని.. విద్యార్థి దశ నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో ఆదివారం క్రయన్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో దోమ జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, నాయకులు వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీసులు, రిపోర్టర్ల క్రికెట్ మ్యాచ్



గెలుపొందిన పోలీసు జట్టు



ప్రెస్ జట్టుకు బహుమతి అందజేస్తున్న డీఎస్పీ

అభినందించిన తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు: ఎనిమిదేళ్లుగా పోలీసులు, రిపోర్టర్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం అభినందనీయమని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని సెయింట్ మార్క్స్ పాఠశాల మైదానంలో తాండూరు సబ్ డివిజన్ పోలీసు, ప్రెస్ జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. రూరల్ సీఐ రాంబాబు సారథ్యంలోని పోలీసు జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుని బరిలోకి దిగారు. 16 ఓవర్లలో మొత్తం 121 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. అనంతరం ప్రెస్ జట్టు 11.5 ఓవర్లలో 78 పరుగులతో ఓటమిపాలైంది. 5 వికెట్లు తీసిన కానిస్టేబుల్ వెంకటేశ్, ప్రెస్‌జట్టు నుంచి కాశీంపాషా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందేరేపకపానే. అనంతరం విజేతగా నిలిచిన పోలీసు జట్టుకు రూ.3వేల నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన జట్టు సభ్యులకు డీఎస్పీ శేఖర్‌గౌడ్ షీల్డ్‌తో పాటు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐలు రాంబాబు, రాజేందర్‌రెడ్డి, ఎస్సైలు విద్యాచరణ్‌రెడ్డి, అరవింద్, వేణుగోపాల్‌గౌడ్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాసచారి, వేణుగోపాల్ రెడ్డి, శెట్టిరవిశంకర్, , లింగేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు రూ.3.25 కోట్లు

- 2004 నుంచి వసూలుకాని కస్టమర్ చార్జీలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత



కోట్‌పల్లి సబ్ స్టేసన్

బంట్వారం: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి తొలి సంతకంతో ప్రారంభమైన ఉచిత విద్యుత్ నేడు రైతాంగానికి నిరంతరాయంగా కొనసాగుతోంది. అయినప్పటికీ 2004 నుంచి రైతులు కస్టమర్ చార్జీలు సైతం చెల్లించడం లేదు. ఈ చార్జీలు ఎలా వసూలు చేయాలో తెలియన ట్రాన్స్‌కో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా కోట్‌పల్లి సెక్షన్ పరిధిలో వివిధ కేటగిరిల్లో ఇప్పటి వరకు రూ.3.25 కోట్లు విద్యుత్ బిల్లుల బకాయిలున్నాయి. వ్యవసాయ రంగానికి సంబంధించి 3,018 ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరు రోజుకు రూపాయి చొప్పున నెలకు రూ.30 కస్టమర్ చార్జీలు చెల్లించాల్సి ఉండగా చాలా మంది రైతులు మొండికేస్తున్నారు. ఏళ్ల తరబడి కట్టకపోవడంతో బకాయి రూ.70లక్షలకు చేరింది. మొండి బకాయిలను రాబట్టేందుకు ట్రాన్స్‌కో అధికారులు నానా తంటాలు పడుతున్నారు. దక్షిణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కోట్‌పల్లి సెక్షన్ పరిధిలో నాలుగు సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి కింద ఏడు కేటగిరిల్లో కలిపి ఇప్పటి వరకు రూ.1.75కోట్లు విద్యుత్ బకాయిలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అదేవిధంగా బిల్ స్టాప్, యూడీసీ బకాయిల కింద మరో రూ.కోటిన్నర వసూలు కావాల్సి ఉంది. కోట్‌పల్లి సెక్షన్ కింద బంట్వారం, తొర్మామిడి, కోట్‌పల్లి, బార్వాద్ సబ్ స్టేషన్లుండగా వీటి కింద వివిధ కేటగిరీల్లో కలిపి 11,320 విద్యుత్ సర్వీసులు కొనసాగుతున్నాయి. హౌస్‌హోల్డ్ సర్వీసుల నుంచి రూ.65 లక్షలు వసూలు కావాల్సి ఉంది. కమర్షియల్, ఇండస్ట్రియల్ , వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్స్ , ప్రభుత్వ ఆఫీసులు, స్కూల్స్, ప్రార్థనా మందిరాల నుంచి మరో రూ.40 లక్షలకు పైగా బకాయి ఉంది.

అదనపు పనిభారం

కోట్‌పల్లి సెక్షన్ పరిధిలో 15మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో డ్యూటీలో ఉన్న వారికి అదనపు పని భారం పడుతోంది. బిల్లుల వసూళ్లు ఇబ్బందికరమే.

బకాయిలు రాబడుతాం



మొండి బకాయిలను వసూలు చేస్తాం. సరిపడా సిబ్బంది లేకపోవడంతో కొంత ఇబ్బంది కలుగుతోంది. అయినప్పటికీ తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నాం. వినియోగదారులు ట్రాన్స్‌కోకు సహకరించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి. కరెంటును దుబారా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి.

– సురేశ్‌రెడ్డి, ఏఈ, ట్రాన్స్‌కో

వంటగ్యాస్ మంట

- పెరుగుతున్న ధరలతో వినియోగదారుల ఇబ్బందులు
- అదనపు భారంతో సతమతం
- కట్టెల పొయ్యే దిక్కంటున్న పేదలు



దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా గ్యాస్ వినియోగదారులపై భారం మోపుతోంది. పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు వంటగ్యాస్ ధరలు ఎప్పుడు పెరుగుతాయో ఊహించలేని పరిస్థితి ఏర్పడింది. వినియోగదారులు ఇబ్బందులను పట్టించుకోకుండానే ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచి ఆయా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు మెసేజ్ విడుదల చేస్తోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న ప్రజలు ప్రభుత్వ నిర్ణయాలతో కొనుగోలు శక్తి తగ్గి అల్లాడిపోతున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

రెండు నెలలుగా గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1082కి చేరింది. దీంతో ఆయా గ్యాస్ ఏజెన్సీల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఒక్కసారిగా భారం పడింది. అకస్మాత్తుగా ధరలు పెచడంతో గ్యాస్ ఏజెన్సీలు సైతం వినియోగదారులకు సమాధానం చెప్పేందుకు ఇబ్బంది పడుతున్నారు. ధరల పెంపుపై అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి తినేందుకు వీలులేకుండా ఉన్న తరుణంలో గ్యాస్ ధరలు పెరగడంతో బడ్జెట్ కుటుంబాల పరిస్థితి దారుణంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రతీ నెల ధరలు పెంచుతూ పోతే నిరుపేదలు గ్యాస్ సిలిండర్‌ను ఎలా వినియోగించాలని కలత చెందుతున్నారు.

కాపాడబోయాడు.. గల్లంతయ్యాడు

పరిగి: నీటికుంటలో ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తిని కాపాడేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన బాబాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మల్లెమోనిగూడకు చెందిన రాంచంద్రయ్య అమ్మవారి పండుగ ఉండడంతో బాబాపూర్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. ఆయన బయటికి వెళ్లిన సమయంలో ఓ బాటసారి కాలుజారి నీటి కుంటలో పడిపోయాడు. గమనించిన రాంచంద్రయ్య అత డిని కాపాడేందుకు కుంటలోకి దిగి గల్లంతయ్యాడు. కాగా కుంట నుంచి బయటకు వచ్చి న వ్యక్తి చుట్టు పక్కలవారికి సమాచారం ఇచ్చి తన వివరాలేవీ చెప్పకుండా వెళ్లిపోయాడు. రా ంచంద్రయ్య ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఒడ్డుపైనున్న దుస్తు లు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చా రు. నీటికుంటలో ఎంత వెతికినా ఆచూకీ లభి ంచలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశా మని సోమవారం వెతుకుతామని ఎస్సై తెలిపారు.

11న ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సు

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 11న బెంగళూరులో ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ చెప్పారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం నరేశ్ మాట్లా డుతూ.. సమానత్వం, సమాజహితమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ దేశ వ్యాప్తంగా పోరాటాలు సాగిస్తోందన్నారు. సమాజంలోని ఆర్థిక, సామాజిక, రాజ కీయ అసమానతలను రూపుమాపి బహుజనులను చైతన్యం చేసేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు, రేషన్ బియ్యంతో పాటు పలు పథకాలు ఎమ్మార్పీఎస్ చలువే అని గుర్తుచేశారు. వర్గీకరణ లక్ష్యంగా ఈ నెల11న బెంగుళూరులో జాతీయ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటనోళ్ల నరసింహ, అంతయ్య, రవికుమార్, కృష్ణ, అశోక్, నవీన్, మల్లేశ్, బాల్‌రాజు పాల్గొన్నారు.